# చిత్రం

**-జి.వి.ఎస్.ఎస్. కుమార్**



సోఫాలో రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడతడు.

బయట నిప్పులుచెరిగే ఎండలోంచి నడుచుకొని వచ్చినా, అతడి ముఖంలో అనుకున్నది సాధించగలిగానన్న ఆనందం, తృప్తి తప్ప అలసట వీసమంతయినా కనిపించడం లేదు.

అతడికి చిన్ననాటి నుంచి కళలన్నా, కళాకారులన్నా అభిమానం. తనూ ఒక కళాకారుడుగా గుర్తించబడాలనే కోరిక మనసునిండా ఉండేది. ఈమధ్యే ఒక సంస్థ వారు పత్రికలో వేసిన ప్రకటన చూసి, ఒక పెయింటింగ్ వేయడం మొదలు పెట్టాడు. ఆ పోటీలో ఉత్తమంగా నిర్ణయించబడిన చిత్రాన్ని గీసిన యువ కళాకారుడ్ని బంగారు పతకంతో సత్కరిస్తామని కూడా ఆ సంస్థ వారు ప్రకటించారు. ఆ విషయం తెలియగానే ఇంతటి గొప్ప సదవకాశాన్ని ఎట్టి పరిస్థితులలోనూ చేజార్చుకొనరాదని, తన చిరకాల వాంఛ నెరవేరడానికి ఇదే తగిన సమయమని భావించాడు. అందుకే రాత్రనక, పగలనక వారం రోజులు శ్రమించి వేసిన పెయింటింగ్‌ని మండుటెండలో వెళ్ళి ఆ సంస్థ వారికి అందించి వచ్చి సోఫాలో రిలాక్స్‌డ్‌గా కూర్చుని, తనలోని చిత్రకారుడ్ని తానే అభినందించుకుంటూ ఆనందిస్తున్నాడు. కాసేపటికి ఆ ఆనందం నుంచి తేరుకుని సోఫాలోంచి లేవబోతూ పక్కనే టేబుల్‌పై చుట్ట చుట్టి పెట్టి వున్న పెయింటింగ్ చార్టుని చూశాడు. దానిని అందుకొని యథాలాపంగా తెరచి చూశాడు. ఒక్కసారిగా అతని కళ్ళు బైర్లుకమ్మాయి. ఎందుకంటే అదే అతడు వారం రోజులూ శ్రమించి వేసిన పెయింటింగ్. "ఈ పెయింటింగ్ ఇక్కడుందేంటి? మరి వాళ్ళకిచ్చిన పెయింటింగ్?" మనసంతా బరువెక్కింది. ఇప్పటి వరకు మనసుని వూపేసిన ఆనందమంతా ఒక్కసారిగా పటాపంచలైపోయింది. "ఇప్పుడెలా?" మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

ఈ అసలైన పెయింటింగ్ తీసుకొని మళ్ళీ ఆ సంస్థకు బయలు దేరాడు. అతను అక్కడికి చేరడానికి అరగంట ముందే ఆ ఆఫీసు క్లోజ్ చేశారు. పైగా ఆ రోజే ఎంట్రీలు తీసుకొనే చివరి రోజు కూడా. ఇక చేసేదిలేక విచార వదనంతో ఇంటి ముఖం పట్టాడతడు.

రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు "పోస్ట్..." అన్న పిలుపు వినిపించి వెళ్ళి పోస్ట్‌మెన్ చేతిలోని లెటర్ అందుకొని చదివాడు "మీ పెయింటింగ్ మొదటి బహుమతిని గెలుచుకుంది. వచ్చే శుక్రవారం మిమ్మల్ని మా సంస్థ తరపున సన్మానిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. తమరు తప్పక విచ్చేయవలెన"ని కోరుతూ ఆ సంస్థ వారు పంపిన ఆహ్వాన పత్రిక అది "ఇదేంటి పెయింటింగ్ నా దగ్గరే వుంటే బహుమతి ఎలా వచ్చింది?" మళ్ళీ ఆలోచనలో పడ్డాడతడు.

ఆ రోజు కాస్తా రానేవచ్చింది. సభ మొదలైంది. వక్తలంతా ఆ పెయింటింగ్‌ని వర్ణిస్తూ 'సమాజంలోని ఘోరాలు, అరాచకాలకు అద్దం పడుతుందీ చిత్రం. ఇంత గొప్ప చిత్రాన్ని చిత్రించిన చిత్ర కారుడు మన ప్రాంతం వాడు కావడం మనందరికీ గర్వకారణం' అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. కరతాళధ్వనుల మధ్య సన్మాన కార్యక్రమాన్ని కొనసాగించారు.

అతని మనసులోని సంశయం మాత్రం వీడలేదు. "ఈ సన్మానం న్యాయంగా నాకు జరగాల్సిందేనా లేక తొందరపడి నాకు నేనుగా ఈ వేదిక పైకి గాని వచ్చేశానా? తరువాత నాలాంటి పేరు గల వారు మరొకరెవరైనా ఇక్కడికి వస్తే? అమ్మో?" ఇలా ఎన్నో రకాల ఆలోచనలు అతడి మనసుని పట్టి కుదిపేస్తున్నాయి.

ఇంతలో ఒక పెద్ద మనిషి వేదికపైనున్న మైకు దగ్గరికొచ్చి ఉత్తమ బహుమతిని గెలుచుకున్న పెయింటింగ్‌ని ఆ పక్కనున్న హాలులో ఉంచాం. రసజ్ఞులైన సభికులంతా వెళ్ళి చూడవచ్చును అనడంతో సభలోని వారంతా అత్యంత ఉత్సాహంతో అటుగా కదిలారు.

వాళ్ళందరికంటే ముందే ఆ పెయింటింగ్‌ని చూడాలనే ఉత్సాహం, ఆతృతతో ఆ జనమందరిని తప్పించుకుంటూ చివరికి పెయింటింగ్ దగ్గరికి చేరుకున్నాడు. ఆ పెయింటింగ్‌ని చూసేసరికి అతడు ఒక్కసారిగా అవాక్కయ్యాడు.

శ్వాస పీల్చడం సైతం మరచిపోయి కొయ్యబారిపోయి వున్నచోటనే అలా చాలా సమయం నిలబడి వుండిపోయాడు. ఆ పెయింటింగ్ తాను రంగులు మిక్స్ చేసుకున్న రఫ్ చార్ట్!!

## దుస్తులపై మరకలు పోవాలంటే...

ఖరీదైన దుస్తులపై మరకలను చూడాలంటే బాధగానే వుంటుంది. మరకలను తొలగించడానికి ఈ కింది సూచనలు పాటించి చూడండి....

* బట్టలపై టీ, కాఫీ మరకలుపోవాలంటే ఒకగిన్నె అంచుమీద మరకలు పడిన గుడ్డనుంచి మూడు అడుగుల ఎత్తునుంచి వేడినీళ్ళ పోయాలి.
* పాలమరకలైతే వేడి నీటితో కడిగి ఆరబెట్టిన తర్వాత టాల్కం పౌడర్‌ను మరకల మీద రుద్దాలి.

రక్తం మరకలున్న బట్టలను ఉప్పు కలిపిన చల్లటినీటిలో రెండు గంటలు నానబెట్టి తర్వాత డిటర్జెంట్ సబ్బుతో శుభ్రం చేయాలి.

* పళ్లు, పానీయాల మరకలను తొలగించాలంటే మరకలమీద ఉప్పుతో రుద్దుతూ మూడు అడుగుల ఎత్తునుంచి నీళ్ల పోయాలి. అప్పటికీ పోలేదంటే గ్లిజరిన్ వాడి చూడండి.
* తారు, బూట్‌పాలీష్, పెయింట్ మరకలైన చోట మొదట చాకు కొనతో సాధ్యమైనంతవరకు మరకలను తొలగించాలి. తర్వాత కిరోసిన్ లేదా టర్పంటైన్ ఆయిల్‌లో నానబెట్టి డిటర్జెంట్‌సబ్బుతో ఉతకాలి. బట్టలపై మట్టి మరకలు తొలగించాలంటే పచ్చిబంగాళాదుంప(ఆలుగడ్డ)తో రుద్దితే సరి.